# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

బుధవారం | 24 జూన్ , 2026 | పేజీలు : 6


## గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి

### కలెక్టర్ చంద్రశేఖర్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** గ్రంథాలయాలు చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. పాఠకులతో పాటు విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.మంగళవారం జిల్లా కలెక్టర్ నల్గొండ జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశా రు. గ్రంథాలయంలో పుస్తకాలు, తాగునీరు, టాయిలెట్లు, వైఫై సౌకర్యం తదితర అంశాలను పరిశీలించారు. ఇతర సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి, పాఠకులకు సూచించారు.ఈ సందర్భంగా పాఠకులు స్పందిస్తూ, గ్రంథాలయంలో తమకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు లేవని కలెక్టర్‌కు తెలిపారు.

# సన్న వడ్ల సాగుకు ప్రాధాన్యం

### ప్రభుత్వ విప్,స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం




**ప్రజాపక్షం/నకిరేకల్ :** రైతులు దొడ్డు రకం కాకుండా సన్న రకం వడ్లను సాగు చేసే విధంగా అధికారులు రైతులను ప్రోత్సహించాలని ప్రభుత్వ విప్,స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నారాయణ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నకిరేకల్ నియోజకవర్గ స్థాయి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించిన నిర్వాహకులు,అధికారులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం అధికారులు, నిర్వాహకులు ఎంతో కష్టపడ్డారని, ఎక్కడైనా వడ్లు తడిస్తే రైతులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో రాత్రింబవళ్లు పనిచేశారన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రతిపక్షాలు అనేక అసత్య ఆరోపణలు చేశాయన్నారు. కానీ ఈ సీజన్‌లో భారీ స్థాయిలో ధాన్యం వచ్చినప్పటికీ సమిష్టిగా పనిచేసి వేగంగా కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసామన్నారు. నేడు రైతులు సంతోషంగా ఉండటం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత,జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**రైతు వేదికల్లో నాణ్యమైన విత్తనాలు**

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం రైతు వేదికలను కేంద్రాలుగా వినియోగిస్తోందని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు.మంగళవారం నకిరేకల్‌లోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తనాల విక్రయ స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూరైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పంటలకు అనువైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఏడిఏ.టి.విజయేందర్ రెడ్డి, ఏ.వో మహమ్మద్ జానిమియా, పిఏసిఎస్ చైర్మన్ నాగుల వంచ వెంకటేశ్వరరావు, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, మహేందర్ రెడ్డి ,శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితుల్లో తక్కువ నీరు అవసరమయ్యే పంటలు సాగు

### కనగల్ విత్తన మేళాలో రైతులకు సూచించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నల్లగొండ (కనగల్ ):** రైతులు వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటలను ఎంచుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సూచించారు.మంగళవారం నల్గొండ జిల్లా కనగల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని, రానున్న సీజన్‌లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందని తెలిపారు.కాబట్టి నీరు తక్కువ అవసరమయ్యే పంటలను సాగు చేయాలని, మెరుగైన విత్తనాలు, యాజమాన్య పద్ధతులు పాటిస్తే సరైన దిగుబడులు పొందవచ్చని అన్నారు. ఎలాంటి పంటలు, విత్తనాలు వేసుకోవాలో రైతు వేదికల్లో వ్యవసాయ అధికారుల సూచనలు తీసుకోవాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 140 రైతు వేదికల్లో విత్తన మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరి పండించే రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు, ముఖ్యంగా సన్న రకాల వరి సాగుపై దృష్టి పెట్టాలని, వర్షం తక్కువగా ఉన్నప్పుడు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన యూరియాను సకాలంలో అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కనగల్ మండల వ్యవసాయ అధికారి, తహసీల్దార్ పద్మ, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం కలెక్టర్ కనగల్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ సమీపంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న హైరోడ్ పైలాన్ పనులను పరిశీలించారు. పైలాన్‌తో పాటు పరిసరాలు, రైలింగ్, సుందరీకరణ పనులపై ఇంజినీరింగ్ అధికారులకు తగు సూచనలు చేశారు.




## రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభించాలి

### మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి పంట మార్పిడి ద్వారా అధిక దిగుబడులు సాధించాలని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణ పరిధిలోని రైతు వేదికలో విత్తన మేళా,పంటల సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రైతులకు పంటల ఎంపిక, పంట మార్పిడి,నాణ్యమైన విత్తనాల వినియోగం, నేల ఆరోగ్య పరిరక్షణ,ఎరువుల సమతుల్య వినియోగం,ఆధునిక సాగు పద్ధతులపై నిపుణులు అవగాహన కల్పించారు. ఒకే పంటను పదేపదే సాగు చేయడం వల్ల నేల సారవంతత తగ్గిపోతుందని,పంట మార్పిడి విధానాన్ని అనుసరించడం ద్వారా భూమి ఆరోగ్యం మెరుగుపడి రైతులకు అధిక లాభాలు చేకూరుతాయని తెలిపారు. అగ్రికల్చర్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు,ధృవీకరించిన విత్తనాల వినియోగం ద్వారా రైతులు మెరుగైన దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ అనంతరెడ్డి మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగు రైతులకు అదనపు ఆదాయ మార్గంగా నిలుస్తుందని వివరించారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరాజు,సంక్షేమ సంఘం అసిస్టెంట్ డైరెక్టర్ గిరి ప్రసాద్, రెండవ డివిజన్ కార్పొరేటర్ పెరిక యాద య్య, మూడవ డివిజన్ కార్పొరేటర్ పేర్ల మల్లేశ్వరి అశోక్ చంద్ర,వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.




## బాధితులకు త్వరితగతిన న్యాయం

### ఎస్పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మహిళలు, చిన్నారులపై జరిగే హింస, వేధింపులు,లైంగిక దాడుల కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర మహిళా భద్రత విభాగం ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని భరోసా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. లైంగిక దాడులు, వేధింపులకు గురైన మహిళలు, చిన్నారులకు ఒకే చోట వైద్య, న్యాయ, మానసిక, పునరావాస సేవలు అందించడమే భరోసా కేంద్రాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లాలో 2021 నుంచి 2026 జూన్ వరకు భరోసా కేంద్రం పరిధిలో పోక్సో,అత్యాచారం,మహిళలు, చిన్నారులపై జరిగిన కేసులు మొత్తం 806 నమోదైనట్లు తెలిపారు. వీటిలో 16 కేసుల్లో నిందితులకు శిక్షలు ఖరారయ్యాయని, బాధితులకు మొత్తం రూ.1.68 కోట్లకు పైగా పరిహారం అందించినట్లు వెల్లడించారు.బాల్య వివాహాల నివారణకు గ్రామాలు,పాఠశాలలు,కళాశాలల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ తెలిపారు. విద్యార్థులకు పోక్సో చట్టం, బాలల హక్కులు,బాల్య వివాహాల దుష్పరిణామాలు, సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు వంటి అంశాలపై నిరంతర అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి విశ్వనాథ్ కులకర్ణి, ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి సాయి మేఘనా,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ కృష్ణయ్య,పబ్లిక్ ప్రాసిక్యూటర్ రంజిత్ కుమార్,విమెన్ పోలీస్ స్టేషన్ సీఐ మంజుల,భరోసా ఇన్‌చార్జ్ ఎస్ఐ అమ్రిన్,భరోసా కేంద్రం కోఆర్డినేటర్ నళిన,వైద్య శాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఎంపిపి కార్యాలయాలకు ఉద్యోగుల బదిలీ

### సిపిఆర్ ప్రొసీడింగ్స్ ప్రకారం పోస్టింగ్‌లు

**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లాలోని వివిధ మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ) కార్యాలయాలకు ఉద్యోగులను బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.సీపీఆర్ ప్రొసీడింగ్స్ ప్రకారం ఎంపీఓ (మండల పరిషత్ అధికారి),సూపరింటెండెంట్ ఫీడర్ కేటగిరీలకు చెందిన 13 మంది ఉద్యోగుల్లో 9 మంది ఎంపీఓలు,4 మంది సూపరింటెండెంట్లు ఉన్నారు.బదిలీ ఉత్తర్వులు అందుకున్న ఉద్యోగులు వెంటనే తమకు కేటాయించిన మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో విధుల్లో చేరాలని సంబంధిత అధికారులు సూచించారు.జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం మహ్మద్ మజీద్‌ను అనుముల ఎంపీపీ కార్యాలయానికి,పి.మోహన కుమారిని త్రిపురారం ఎంపీపీ కార్యాలయానికి,కె. వెంకటయ్యను దామరచర్ల ఎంపీపీ కార్యాలయానికి,మహ్మద్ అబ్దుల్ సమద్‌ను తిప్పర్తి ఎంపీపీ కార్యాలయానికి,జి.బ్రహ్మచారిని నకిరేకల్ ఎంపీపీ కార్యాలయానికి,డి. ఒకటేష్‌ను చందంపేట ఎంపీపీ కార్యాలయానికి, పి.వెంకటేశ్వర్ రెడ్డిని మునుగోడు ఎంపీపీ కార్యాలయానికి,ఎం.ఎ. సలీంను కేతేపల్లి ఎంపీపీ కార్యాలయానికి నియమించారు.అలాగే జి.అంజన్ రెడ్డిని కట్టంగూర్ ఎంపీపీ కార్యాలయానికి,నర్రా వీరజన్నను గుండ్లపల్లి(డిండి)ఎంపీపీ కార్యాలయానికి,డి.ఎం. అబ్దుల్ అజీమ్‌ను దేవరకొండ ఎంపీపీ కార్యాలయానికి,ఎ.ఎస్.జి.ఎ.వై. హమ్దానిని అడవిదేవులపల్లి ఎంపీపీ కార్యాలయానికి, బి.విజయ్ కుమార్ పాల్‌ను నేరేడుగొమ్ము ఎంపీపీ కార్యాలయానికి పోస్టింగ్ ఇచ్చారు.

# ఫీజుల దోపిడీపై చర్యలు

**ప్రజాపక్షం/మోతె :** ఫీజుల దోపిడిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ఎలుగు మధు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పుస్తకాలు, యూనిఫామ్‌లు, ప్రత్యేక కోచింగ్‌ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లి దండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను వ్యాపారంగా మార్చి ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేయడం వల్ల మధ్య తరగతి, పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. పుస్తకాలు, యూనిఫారాలు, రవాణా, కోచింగ్ తదితర అంశాల పేరుతో అదనపు వసూళ్లు చేస్తున్న పాఠశాలలపై ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్య ప్రతి పిల్లవాడి హక్కు అది వ్యాపార వస్తువుగా మారకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# రైతు వేదికలో విత్తన మేళా



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** రైతులకు పంట మార్పిడి, సన్న వడ్ల రకాల సాగు పట్ల ప్రోత్సాహం కల్పించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి జావేద్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దిర్శించర్ల రైతు వేదికలో విత్తన మేళా లో అన్ని రకాల నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచి రైతులతో మాట్లాడారు. వ్యవసాయ రంగంలో ఆధునాతన పద్ధతులు, వాటి ప్రోత్సాహాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న వివిధ పథకాలు, విత్తనాలు, నానో యూరియా, ఎరువుల వాడకంపై తగు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూర ప్రకాశ్, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, సర్పంచ్ బుర్రి శ్రీను, డైరెక్టర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు హిమభిందు, త్రివేణి, విత్తన కంపెనీ డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

# సన్న వరి రకాలపై రైతులు దృష్టి సారించాలి

**ప్రజాపక్షం/మునగాల:** వరిలో సన్న రకాలపై రైతులు దృష్టి సారించాలని ఆత్మ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ నివేదిత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో విత్తన మేళాలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం సూచిస్తున్న 7 రకాల సన్న వరి రకాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున రైతులు ఆరు తడి పంటలపై మొగ్గు చూపాలని, నానో ఎరువులను ఉపయోగించుకుని పంట పెట్టుబడి తగ్గించుకొని, దిగుబడి పెంచుకోవాలని అన్నారు. నానో యూరియా, నానో డిఎపి ఉపయోగాలు, వాడకంపై కొరమండల్, రామిసైడ్స్ కంపెనీల ప్రతినిధులు రైతులకు వివరించారు. పశువులకు సంబంధించిన మేత, గడ్డి రకాల సబ్సిడి విత్తనాలపై రేపాల వెటర్నరి డాక్టర్ మమత రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజు, విస్తరణ అధికారులు నాగు, సునిత, రైతులు పాల్గొన్నారు.



# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలి

**ప్రజాపక్షం/అనంతగిరి:** నేటి యువత దేశాభివృద్ధికి పాటుపడే వనరులుగా ఎదగి ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకై నిరంతరం కృషి చేయాలని, గొప్ప వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా, ఇన్స్పిరేషన్‌గా తీసుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్, నిర్మూలనపై పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణ నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా జూన్ 26న రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఈగల్ ఫోర్స్ ఉత్తర్వుల మేరకు జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు డ్రగ్స్ నిర్మూలన, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. యువత డ్రగ్స్ లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌కు అలవాటు పడ్డ వారు నేరాలకు పాల్పడతారని, అనారోగ్యాలకు గురౌతున్నారని అరోపించారు. గ్రడ్స్‌కు దూరంగా ఉండి నిర్మూలనకు



పాటుపడాతామని, డ్రగ్స్ రహిత సమాజంగా తీర్చిదిద్దడానికి రహిత తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేయడంలో ముందుంటామని ప్రతిజ్ఞ చేయించారు. సాంస్కృతి కార్యక్రమాలతో పోలీస్ కళాబృందం వారు డ్రగ్స్ నిర్మూలన, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, మునగాల సిఐ రామకృష్ణారెడ్డి, మేళ్లచెరువు ఎస్ఐ నవీన్‌కుమార్, షీటిమ్ ఎస్ఐ మల్లేష్, కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, ఫార్మసి ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, ప్రసాద్, భూపతి రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మూసీ ప్రాజెక్టు రైట్ కెనాల్ షట్టర్స్ మరమ్మత్తులు చేపట్టాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** గత ఆరు మాసాల క్రితం మూసీ ప్రాజెక్టు కుడి కాలువ మూడు తూముల రైట్ కెనాల్ షెటర్స్ ఊడిపోయాయని తక్షణమే అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మత్తులు చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మూసీ ప్రాజెక్టును తెలంగాణ రైతు సంఘం సూర్యాపేట మండల కమిటి ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ ప్రాజెక్టు షెటర్స్ ఊడిపోవడం మూలంగా నీరు వృధాగా కాలువ ద్వారా ప్రవహించిన కారణంగా ప్రాజెక్టు నీటి మట్టం పెరగకపోవడం వలన ఆయకట్టు రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎలీనోవా ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొన్న కూడా పాలకులు గాని, అధికారులు గాని ప్రాజెక్టులో ఉన్న నీటిని కాపాడడంలో ఏ మాత్రం చిత్తశుద్ధి కనబరచలేదని విమర్శించారు. తక్షణమే రైట్ కెనాల్ షటర్స్ బాగు చేయించి ఆయకట్టు రైతాంగంలో ఉన్న సందిగ్ధాన్ని తీర్చాలని లేనియెడల ఆయకట్టు రైతాంగాన్ని సమీకరించి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మందడి రాంరెడ్డి, నాయకులు నారాయణ వీరారెడ్డి, పందిరి సత్యనారాయణ రెడ్డి, బోళ్ళ నాగేందర్ రెడ్డి, కేశవరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# నేడు దేవతా విగ్రహాల ప్రతిష్ట

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని దోసపహాడ్‌లో శ్రీసూరమాంబా దేవి సమేత శ్రీకంఠమహేశ్వర స్వామి, వనం యల్లమ్మ, వనం మైసమ్మ దేవతల విగ్రహ ప్రతిష్ట, కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు నేటి (బుధవారం) నుండి ప్రారంభం కానున్నట్లు దేవాలయ కమిటి చైర్మన్ సుద్దల వంశీ తెలిపారు. గ్రామంలోని గౌడ కులస్తుల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు కౌండిన్య మూరగాని అశోక్ పంతులు బృందం పర్యవేక్షణలో 5 రోజులపాటు ఘనంగా జరగనున్నట్లు చెప్పారు. మొదటి రోజు ఉదయం బ్రహ్మమూహుర్తంలో గణపతిపూజ, కౌండిన్య మహాముని పూజలతో ఉత్సవం ప్రారంభమై దీక్షాకంకణదారణ, గ్రామాలలో విగ్రహ శోభాయాత్ర, రాత్రి జలనిధి వాసం, ఇండ్ల వద్ద హారతులు ఉంటాయని తెలిపారు. గురువారం నవగ్రహ, గాయత్రి హోమాలు, పంచామృత అభిషేకం, సాయంత్రం మహిళలచే అష్టలక్ష్మి పూజ,



రాత్రి ధ్యానదివాసాలు నిర్వహిస్తామని చెప్పారు. 26న ఉదయం యంత్ర ప్రతిష్ట, మధ్యాహ్నం మహా అన్నదానం, సాయంత్రం బోనాల ఊరేగింపుతో పాటు దేవతామూర్తుల వైభవ కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా సాగనుందని స్పష్టం చేశారు. 28న తెల్లవారుజామున 4 గంటలకు వనం యల్లమ్మ, వనం మైసమ్మ దేవతలకు బోనాలు సమర్పించి అనంతరం బలిహారణతో ఉత్సవాలు ముగిస్తామని వివరించారు. 5 రోజులపాటు జరిగే ఈ వేడుకలకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

# డ్రగ్స్ లేని సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

**ప్రజాపక్షం/చివ్వెంల :** ప్రతి ఒక్కరూ వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన డ్రగ్స్ లేని సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని డిఎస్పి ప్రసన్న కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఐలాపురం గ్రామంలో గల గురుకుల మహిళా పాఠశాల నందు విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కల్పించారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు 100, 112, 1908కు సమాచారం అందించాలని సూచించారు. ప్రతి పౌరుడు, విద్యార్థి యువత డ్రగ్స్ నిర్మూ




లనకు సైనికునిగా పనిచేయాలని డ్రగ్స్ నిర్మూలనలో యాంటీ డ్రగ్స్ సోల్జర్‌గా పేరు నమోదు చేసుకోవాలని సెల్ఫీస్టిక్‌ను ప్రదర్శించి విద్యార్థులతో యాంటీ డ్రగ్ సోల్జర్‌గా పేరు నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో సిఐ రాజశేఖర్, ఎస్ఐ మహేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# న్యాయవాద పట్టాభద్రుల నుండి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** 2026/27 విద్యాసంవత్సరానికి గాను న్యాయవాద వృత్తిలో (03) సంవత్సరముల శిక్షణ కొరకు జిల్లాలోని ఎస్‌సి కులములకు చెందిన న్యాయవాద పట్టభద్రుల నుండి షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ, సూర్యాపేట జిల్లా తరపున దరఖాస్తులను కోరుతున్నట్లు ఆ శాఖ అధికారిణి కె. దయానందరాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు న్యాయశాస్త్రములో డిగ్రీ ఉత్తీర్ణులై, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2లక్షలకు మించని ఎస్‌సి అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణ కాలములో నెలకు రూ.3వేల చొప్పున స్టైఫండ్, పుస్తకములు, కంప్యూటర్, ఫర్నీచర్, లాయర్ డ్రస్ కొనుగోలు కొరకు ఒకసారి మాత్రమే రూ.50వేలు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను తేది31.07.2026 లోపు https://telanganaepass.cgg.gov.in ఆన్‌లైన్‌లో సమర్పించాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి బయోడేటాతో పాటు కులము, ఆదాయము మీ సేవ ద్వారా పొందినవి, 10వ తరగతి నుండి డిగ్రీ, ఎల్.ఎల్.బి మార్కుల జాబితాతోపాటు బార్ కౌన్సిల్ నమోదు (తప్పనిసరిగా), అన్ని పత్రములతో సూర్యాపేట జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కార్యాలయంలో తేది.02.08.2026 సాయంత్ర 5 గంటలలోపు సమర్పించాలని వివరించారు.

# తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** అఖిల భారత రైతు సంఘం రాష్ట్ర రైతు సంఘం పిలుపులో భాగంగా మండల తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి జక్క దయాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎరువుల ధరలు,డీజిల్ పెట్రోల్ గ్యాస్ ధరలను తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం రైతు రుణమాఫీ రెండు లక్షలు పైన ఉన్న రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని రైతు భరోసా ఎన్ని ఎకరాలు సాగు చేస్తే అన్ని ఎకరాలకు ఇవ్వాలని ఎలాంటి షరతులు లేకుండా జూన్ 30 తారీఖు వరకు రైతు ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వమే రైతు బీమా చెల్లించి రైతు బీమాని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొబ్బల లాల్ రెడ్డి, కసరబోయిన సత్తయ్య, మజ్జిగ నరసయ్య, కాల్వల నరసయ్య, అంబోజి రాములు, మారుపాక అంజయ్య, బత్తిని లింగయ్య, దుర్గపతి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతు వేదికలో విత్తన మేళా



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** రైతు వేదికలో మంగళవారం రైతు వేదికలో విత్తన మేళ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకి ప్రభుత్వం సూచించిన సన్న వడ్ల విత్తనాలను, కంది విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగింది అలాగే నానో డి ఏ పి అందుబాటులో ఉంచడం జరిగింది రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సన్న వడ్లు రకాలు బి పి టి 5204, అర్ ఎన్ ఆర్ 15048, హెచ్ ఎం టి సోనా, కె ఎన్ ఎం 1638, జై శ్రీరామ్, కె ఎన్ ఎం 7715, డబ్ల్యూ జి ఎల్ 44 ఈ రకాలు సాగు చేస్తే బోనస్ లభిస్తుంది. మండల వ్యవసాయ అధికారి పాండురంగ చారి, ఏఈఓలు అక్షర, రవి తేజ, పలు విత్తన డీలర్స్ రైతులు పాల్గొన్నారు.

# కామర్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు అహ్వానం

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల పరిధిలోని కరివిరాల ఆదర్శ పాఠశాలలో కామర్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సాయి ఈశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో కోరా రు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పాఠశాలలో పనిచేయు వేళలో ఈనెల 24వ నుండి 29వ తేదీల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల మధ్య కరివిరాల పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

# తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సైదులు

**ప్రజాపక్షం/మోతె :** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మండలానికి చెందిన మట్టిపెల్లి సైదులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహబూబ్‌నగర్‌లో జరిగిన ఆ సంఘం రాష్ట్ర మహాసభల్లో ఆయన ఎన్నికైనట్లు సంఘ పెద్దలు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మరింత బలమైన పోరాటాలు నిర్మిస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీల అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉచిత వైద్య శిబిరం




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** లయన్స్ క్లబ్ హయత్ నగర్ ఆధ్వర్యంలో పెద్దగూడెం గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బాచుపల్లి రవీందర్రావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. మలక్ పేట్ యశోద హాస్పిటల్ డాక్టర్స్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దగూడెం సర్పంచ్ పకీరు లతా, కట్ట నర్సిరెడ్డి, మన్నె నర్సింహారెడ్డి, దేవి రెడ్డి రవీందర్ రెడ్డి, వాకిటి నరసింహారెడ్డి, యశోద హాస్పిటల్ డాక్టర్స్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మాదకద్రవ్యాలను వ్యతిరేకిద్దాం



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని సర్వేల్ గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ అక్రమ మాదక ద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవాల సందర్భంగా అవగాహన విద్యార్థులకు స్థానిక ఎస్సై జె.జగన్ అవగాహన కల్పించేందుకు కార్యక్రమం నిర్వహించి ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు సేవించడం వల్ల ఆరోగ్యంతో పాటు, అనేక దుష్పరిణామాలు జరుగుతాయని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్వేల్ గురుకుల పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట పట్టణానికి చెందిన యువకుడు మహమ్మద్ యాకూబ్ షరీఫ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు.తన వంతు సహాయంగా టిఆర్ఎస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు, టియుఎఫ్ ఉద్యమ నేత, హంస ఫౌండేషన్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ చాంద్ వారి కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యం, రూ.2000 నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మాజీ ఎంపిటిసి ఎండి అమేర్, ఎండి ముషబ్ పాల్గొన్నారు.

# సబ్బండ వర్గాల పోరాటమే అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ రద్దు



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రామన్నపేట ప్రాంతంలో ఆదాని గ్రూప్ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని నెలకొల్పడాన్ని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తీవ్రంగా వ్యతిరేకించారు. కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించి అధికారులకు కంపెనీని నెలకొల్పవద్దని అన్ని ప్రభుత్వ ఆఫీసుల్లో మెమోరండం ఇవ్వడం జరిగింది. పబ్లిక్ ఇయర్ రింగ్ రోజు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అయినా తనను కూడా చాలా ఇబ్బందులకు గురిచేసి అరెస్టు చేశారు. అయినా మా పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని వివిధ రూపాలలో నిరసన కార్యక్రమాలు నిర్వహించి వ్యతిరేకించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, పల్లివాడ సర్పంచ్ కంభంపాటి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు వేమవరం సుధీర్ బాబు, పున్న వెంకటేశం, ఎండి ఆమీర్, జిల్లా నాయకులు బద్దుల రమేష్, ఎస్.కె చాంద్, పట్టణ కార్యదర్శి జాడ సంతోష్, నాయకులు బొడ్డు అలయ్య, ఎండి అజాజ్ ఖాన్, జాల అమరేందర్ రెడ్డి, చిన్నపాక రమేష్, చెరుకు ఉపేందర్, ఎండి మోసబ్, బాసాని రాజు, ఎండి ఆరిఫ్, అంతటి మల్లేశం పాల్గొన్నారు.

# ప్రజారోగ్య పరిరక్షణకు సమన్వయంతో పనిచేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజారోగ్య పరిరక్షణ, పారిశుద్ధ్య నిర్వహణ,అంటువ్యాధుల నివారణ,ఇందిరమ్మ ఇళ్ల అమలు,ఆస్తి పన్ను వసూళ్లు, మౌలిక వసతుల అభివృద్ధిపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్ చంద్ర అధికారులను ఆదేశించారు.మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో డెంగ్యూ, మలేరియా, కలరా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి వార్డులో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి, దోమల వ్యాప్తికి కారణమయ్యే నిల్వ నీటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రజల్లో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు.ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత లబ్ధిదారుల ఎంపిక, ధ్రువీకరణ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన పేదలకు గృహాలు అందేలా చూడాలని వార్డ్ ఆఫీసర్లకు సూచించారు. గతంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో అవసరమైన మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ పి.వెంకటేశ్వర్లు,ఈఈ బి. మనోహర్,అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణవేణి,డీఈఈ పి. అశోక్, ఏఈలు దిలీప్, ప్రవీణ్, అసీం బాబా, శానిటరీ సూపర్‌వైజర్ జి. శ్రీనివాస్, మేనేజర్ కళ్యాణి, రెవెన్యూ అధికారి శివరాం రెడ్డి, వార్డ్ ఆఫీసర్లు, సెక్షన్ క్లర్కులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నిందితుడికి బెయిల్ వస్తే బాధితురాలి ప్రాణాలకే ప్రమాదం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని కలాల్‌వాడలో ముగ్గురిని పెట్రోల్ పోసి దారుణంగా కాల్చి చంపిన కిరాతకుడు శ్రీకాళహస్తి శిరీష్‌కుమార్‌కు ఎలాంటి బెయిల్ రాకుండా న్యాయస్థానాలు, న్యాయవాదులు అడ్డుకోవాలని బీసీ జేఏసీ మిర్యాలగూడ పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ కోరారు. మంగళవారం పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద జరిగిన జేఏసీ నిరసన ప్రదర్శనలో ఆయన పాల్గొని బాధితులకు తక్షణ న్యాయం జరగాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ మాట్లాడుతూ నిందితుడు జైలు నుండి బయటకు వస్తే తన ప్రాణాలకే ప్రమాదమని బాధితురాలు ధనమ్మ ఇటీవల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం ఇక్కడి తీవ్ర పరిస్థితికి అద్దం పడుతోందన్నారు. నా భర్త బయటకు వస్తే నన్ను చంపేస్తాడంటూ ధనలక్ష్మి చేసిన ఆవేదన సమాజంలో ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసిందన్నారు. భార్యపై ఉన్న పగతో అత్త వనం చందమ్మ, పిల్లలు నక్క లక్ష్మణ్, నక్క ప్రణీతలను అర్ధరాత్రి వేళ పెట్రోల్ పోసి సజీవ దహనం చేసిన వ్యక్తి సమాజానికే ముప్పు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి జిల్లా ఉపాధ్యక్షులు లావురి క్రాంతి కుమార్, వెంకటేష్, పవన్, శ్రీకాంత్, సందీప్, సునీల్, నాగార్జున, నాగయ్య, లావణ్య, రజిత, ప్రియాంక, సునీత, మాలతి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# రైతు వేదికలో విత్తన మేళా




**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదిక, మండల పరిధిలోని బ్రహ్మణపల్లి రైతు వేదికలలో మంగళవారం విత్తన మేళా కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి సూరజ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ విత్తన మేళా కార్యక్రమంలో ప్రభుత్వం సూచించిన సన్న రకాల వరి విత్తనాలు, కంది విత్తనాలను రైతులకు అందజేయడం జరిగింది. అనంతరం మండల వ్యవసాయాధికారి సూరజ్ మాట్లాడుతూ ప్రభుత్వం బోనస్ అందించే ఏడు వరి రకాలను రైతులకు సూచించడం జరిగిందని, రైతులు ఈ ఏడు సన్న వరి రకాలను మాత్రమే సాగు చేసుకోవాలని వాటికి మాత్రమే బోనస్ వర్తిస్తుందని తెలిపారు. రైతులు ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా తక్కువ కాలంలో, తక్కువ నీటితో సాగయ్యే పంటలను పండించాలని సూచించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్‌లు ఐలయ్య, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఏఈవోలు శ్వేత, నవనీత, ప్రసన్న, పవన్, రైతులు పాల్గొన్నారు.



# 28న ఇందిరాపార్క్‌లో ఉద్యమకారుల సమ్మేళనం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఈనెల 28న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం చైర్మన్, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు.మంగళవారం నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్ అమరవీరుల స్థూపం వద్ద సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కవులు, కళాకారులు, విద్యార్థులు, మేధావులు, కర్షకులు అనేక త్యాగాలు చేశారని, వందల కేసులు, లాఠీ దెబ్బలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు పెన్షన్ ఇవ్వాలని, 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర నాయకులు మాతంగి అమర్,గురుపాటి సుదర్శన్,జిల్లా ఉద్యమకారుల జేఏసీ నాయకులు ఏర్పుల శ్రవణ్ కుమార్,షేక్ ఆసిఫ్, ముస్తఫా,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బలిదాన్ దివాస్ కార్యక్రమం



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో గౌరవ భారత ప్రధాని నరేంద్ర మోడీ 12 ఏళ్ల సుపరిపాలనను పురస్కరించుకొని మంగళవారం మొక్కలు నాటడం జరిగింది. అలాగే శ్యాం ప్రకాష్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కల రాజు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు పిట్టల శ్రీనివాస్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ఈ దేశ ప్రధాని అయిన తర్వాతే అంత్యోదయ సిద్ధాంతంతో సబ్కాసాత్ సబ్కా విశ్వాస్ సబ్కా వికాస్ అనే విధానంతో ప్రతి చిట్టచివరి వ్యక్తికి ఆర్థిక అభివృద్ధి ఫలాలు అందాలనే లక్ష్యం తోటి పనిచేస్తున్న వ్యక్తి నరేంద్ర మోడీ అని మాట్లాడారు. అనంతరం శ్యాంప్రకాష్ ముఖర్జీ బలిదాన్ దివస్ దినోత్సవం సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ, స్టేట్ కౌన్సిల్ నెంబర్ వనం అంజయ్య, మండల ఇంచార్జ్ కొరివి శంకర్, బిజెపి సీనియర్ నాయకులు ఏళ్ల సంజీవరెడ్డి, రాపోలు స్వామి పాల్గొన్నారు.

# రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/చండూరుః** చండూరు మండలంలో నిర్వహిస్తున్న విత్తన మేళా కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మల్లేశం తెలిపారు. మంగళవారం మండలంలోని కస్తాల రైతు వేదికలో విత్తన మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఓ పాల్గొని ఖరీఫ్ సీజన్‌కు రైతులు పలు సూచనలు చేశారు. రైతులు ప్రభుత్వం సూచించిన 7 రకాల సన్నధాన్యం వంగడాలను మాత్రమే సాగు చేయాలని అన్నారు. బిపిటి 5204,హెచ్ఎంటి సోనా, ఆర్ఎన్ఆర్ 14038, జై శ్రీరామ్ , కెఎన్ఎమ్ 1638, కెఎన్ఎం 7715, వరంగల్ 44 రకాల వరి విత్తనాలను ఖరీఫ్ సీజన్ పంటలపై దృష్టి సారించాలని అన్నారు. కస్తాల గ్రామ సర్పంచ్ లేదన్న సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, ,వైస్ చైర్మన్ పోలు వెంకట్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మేకల సాగర్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ భూతరాజు ఆంజనేయులు , ఎఫ్ఎస్‌సిఎస్ డైరెక్టర్ కట్ట బిక్షం , ఏఈఓలు మహేష్ , నాగార్జున , పద్మజ, జగన్ ,రైతులు తదితరులు పాల్గొన్నారు.





## సిఐకి సన్మానం

**ప్రజా పక్షం/హాలియా:** హాలియా సీఐగా విధులు నిర్వహిస్తున్న దేశిడి సతీష్ రెడ్డి బదిలీపై చౌటుప్పల్ వెళ్తున్న సందర్భంగా అన్నారం సర్పంచ్ రాకేష్ రెడ్డి,సామాజిక కార్యకర్త లింగాల ప్రభాకర్ లు శాలువాతో సన్మానించారు. మంగళవారం సాయంత్రం హాలియా సర్కిల్ కార్యాలయంలో హాలియా ఎస్సైగా, సీఐగా సేవలందించిన సతీష్ రెడ్డిని సర్పంచ్ రాకేష్ రెడ్డి,సామాజిక కార్యకర్త లింగాల ప్రభాకర్‌లు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం ఆయన చౌటుప్పల్ సిఐగా బదిలీపై వెళ్తున్నారు. హాలియా పోలీస్ స్టేషన్లో ఎస్ఐ గా,హాలియా సర్కిల్ ఇన్స్పెక్టర్ గా సేవలు అందించిన ఆయన బదిలీపై వెళ్లటం కొంత బాధాకరమైనప్పటికీ ఆయన వృత్తిలో మరిన్ని ఉన్నత పదోన్నతులు పొందాలని కోరారు.

## మాదకద్రవ్యాలవైపు వెళ్లకుండా జాగ్రత్తపడాలి

**ప్రజాపక్షం/నూతనకల్ :** యువకులు మాదకద్రవ్యాల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తపడాలని తుంగతుర్తి సిఐ కె. ఉపేందర్ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అధికంగా మాదకద్రవ్యాలు వాడుతున్నందున తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, స్టేషన్ సిబ్బంది, మండల ప్రజలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా బిక్కునాయక్

**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము;** నల్గొండ జిల్లా నేరేడుగొమ్ము కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా బిక్కునాయక్ నియమితులయ్యారు. ఈసందర్భంగా నూతనంగా నియమితులైన మండల అధ్యక్షులు బిక్కునాయక్ మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మున్సిపాలిటి పరిధిలోని పాండ్యనాయక్ తండలో మంగళవారం విద్యుత్‌షాక్‌తో పాడిగేదె మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పాండ్య నాయక్ తండకు చెందిన ధరావత్ బిక్షంకు చెందిన పాలిచ్చే బర్రె ప్రతిరోజులాగే మేత కోసం సమీపంలోని బయటకి వెళ్ళి తిరిగి వస్తున్న సమయంలో తండకు ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైరు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. తన జీవనాధారమైన పాలిచ్చే బర్రె మృతి చెందడంతో ధరావత్ బిక్షం తీవ్ర ఆవేదనకు గురై బోరున విలపించాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే విద్యుత్ వైర్లు బయటికి తేలి ఉండడంతో ఈ ప్రమాదం జరిగిందని ప్రభుత్వం తనను ఆదుకొని ఆర్థిక సహాయం అందించాలని కోరారు.



## నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొస్తుందని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. మంగళవారం మిర్యాలగూడ రైతువేదికలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతు వేదికలలో ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ రంగంలో నాణ్యమైన విత్తనాల వినియోగం కీలకమని, సరైన విత్తనాల ఎంపిక ద్వారానే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. రైతులకు వరి, పప్పుధాన్యాలు, సోయాబీన్, కూరగాయల విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డీఏపీ వంటి ఉత్పత్తులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పెరుగుతున్న సాగు ఖర్చులను తగ్గించేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని, రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయాలని సూచించారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అధిక ఫీజుల దోపిడీపై విజిలెన్స్ దాడులు నిర్వహించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని ప్రైవేటు పాఠశాలల్లో సాగుతున్న అధిక ఫీజుల దోపిడీని అరికట్టేందుకు విద్యాశాఖ తక్షణమే విజిలెన్స్ దాడులు నిర్వహించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాల ఇష్టారాజ్యానికి అడ్డుకట్ట వేయాలని కోరుతూ నల్గొండలోని డీఈఓ ఆఫీస్‌లో బీసీ సంఘాలు, మాల మహానాడు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారికి ఉమ్మడిగా ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా పగిడి జీడయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యా హక్కు చట్టం నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ పాఠశాల ఆవరణలోనే అధిక ధరలకు నోట్ పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్, సాక్స్ లు అమ్ముతూ విద్యను పక్కా వ్యాపారంగా మారుస్తున్నాయని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా మండల విద్యాశాఖ అధికారులు నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బిసి రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షులు కర్నాటి యాదగిరి, ఎల్‌హెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ఇస్లావత్ సైదా నాయక్, మాల మహానాడు మిర్యాలగూడ పట్టణ అధ్యక్షులు పట్టేటి రమేష్, మురళి యాదవ్, చిలకల శ్రీను, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సూర్యాపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నెమ్మాది వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మున్సిపల్‌లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వకుండా వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య పనులు చేసే ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు చెందిన నిరుపేదలైన పారిశుద్ధ్య కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోవడం అన్యాయం అన్నారు. పెరుగుతున్న జనాభా ఆధారంగా కార్మికుల సంఖ్య పెంచాలని, పండుగ పూట సెలవులు ఇవ్వాలని, చనిపోయిన వారి స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. డంపింగ్ యార్డ్ వద్ద ఉన్న పాత ఇనుస సామాను కొనుగోలు కేంద్రాన్ని రద్దు చేయాలని, సంవత్సరానికి రెండు జతల బట్టలు, చెప్పులు, కొబ్బరినూనె, పారలు, పొరకలు, బ్లౌజులు ఇవ్వాలన్నారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, కమీషనర్ హన్మంతరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయికుమార్, ఓగోటి దశరథ, ఎల్లమ్మ, తలారి వెంకన్న, రవి, సల్మాన్, సైదులు, పాండు పాల్గొన్నారు.

## రక్తదానం ఒక ప్రాణానికి జీవనదానం కావాలి



**ప్రజాపక్షం/నడిగూడెం:** రక్తదానం చేసే ప్రాణదాతలుగా మిగిలాలని ఎస్ఐ అజయ్‌కుమార్, గ్రామ సర్పంచ్ దున్న శ్రీనివాస్ లు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఖమ్మం వారి సౌజన్యంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ఒక ప్రాణానికి జీవనదామని సరైన సమయంలో రక్తం అవసరమైన సందర్భంలో అందుబాటులో రక్తం లభించక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, రక్తదానం చేసి ఒక ప్రాణానికి జీవనదానం చేయాలని అన్నారు. ముందస్తుగా రక్తం సేకరించి అందుబాటులో ఉంచి చికిత్స అందజేయడం ద్వారా వారి ప్రాణాలు కాపాడిన వారవుతారని తెలిపారు. అనంతరం దాతలకు సంస్థ అందించిన సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉమరాణి, గుండు శ్రీనివాస్, చిల్లంచర్ల సత్యనారాయణ, పల్లెపు నాగేశ్వరరావు, ఎ.రాములు, ఎలక వీరారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వంశీ పాల్గొన్నారు.



## పవన్ కళ్యాణ్‌పై వ్యాఖ్యలు మాని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు మానుకొని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి,ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలంగాణలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడాలని జనసేన ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు,హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సరికొప్పుల నాగేశ్వరరావు హితవు పలికారు.మంగళవారం నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్‌లో గల జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నేరేడుచర్లలో తొలిసారిగా జనసేన నుంచి తన భార్య విజయలక్ష్మి విజయం సాధించారని తెలిపారు. జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు 119 నియోజకవర్గాల్లో నూతన కమిటీలు, ఇన్‌చార్జిలను ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో నల్లగొండ నియోజకవర్గ పీఓసీ కాంపల్లి వెంకట్, సూర్యాపేట నియోజకవర్గ పీఓసీ శివసాయి, నకిరేకల్ ఇన్‌చార్జి రామలింగం,ఉమ్మడి జిల్లా యువజన నాయకులు పున్నం రాంబాబు,నకిరేకంటి కార్తీక్, కుమార స్వామి పాల్గొన్నారు.

## ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం



**ప్రజాపక్షం/హాలియా:** కొత్తపల్లి గ్రామ రెవెన్యూ శివారులో సర్వే నెంబర్ 20 లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని అనుముల రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు తాసిల్దార్ చంద్రరావు తెలిపిన ప్రకారం కొత్తపల్లి గ్రామ రెవెన్యూ శివారులో సర్వేనెంబర్ 20లో ఇందిరా క్రాంతి పథకంలో పెట్రోల్ బంకు నిర్మాణానికి ప్రతిపాదన చేసినట్లు చెప్పారు. అలాంటి ఆ భూమిని కొత్తపల్లికి చెందిన కొందరు ఆక్రమించుకోవడానికి ప్రయత్నించగా వారి నుంచి ఆ ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు, పోలీసుల ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ చంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, చెరువులు, నక్ష బాట గల భూములను ఆక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ భూమిని కాపాడిన రెవిన్యూ, పోలీస్ సిబ్బందిని అభినందించారు. ఆర్ ఐ నవీన్, జిపిఓ పావని తదితరులు ఉన్నారు.

## విత్తనమేళాను సద్వినియోగం

**ప్రజాపక్షం/హాలియా:** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విత్తనమేళా కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్ అన్నారు.హాలియా పరిధిలోని కొత్తపల్లి రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తనమేళా కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు.ఈ విత్తనమేల కార్యక్రమంలో వివిధ రకాల విత్తనాలను రైతుల ముందు ప్రదర్శించినట్లు చెప్పారు. బిపిటి 5204,కేఎన్‌ఎ మ్ 1638,ఆర్ఎన్ఆర్ 150 48, డబ్ల్యూ జి ఎల్44, హెచ్ఎంటి, జైశ్రీ రామ్ అనే సన్నరకం ధాన్యాన్ని సాగుచేసిన రైతులకు మాత్రమే బోనస్ లభిస్తుందని వారు తెలిపారు. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం ఉండడం వలన వాన కాలంలో వర్షాలు తక్కువ కురిసే అవకాశం ఉన్నందున రైతులు ఎవరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు సరిత, మార్కెట్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్,ఏవో వెంకన్న,కొత్తపల్లి సర్పంచ్ అలుగుల బ్రహ్మ రెడ్డి,కొత్తపల్లి సొసైటీ చైర్మన్ మధుసుధన్ రెడ్డి పాల్గొన్నారు.



# రేవంత్ ప్రభుత్వం రైతులను దగా చేస్తుంది

**ప్రజాపక్షం/మునగాల:** ఎన్నికలకు ముందు రాష్ట్ర రైతాంగానికి అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం అధికారం చేపటి నేటికి 30 నెలలు కావస్తున్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఇంత వరకు అమలు చేయకపోవడం చాల దారుణమని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సుంకర అజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రైతులకు రైతుబంధు ఎకరానికి 15వేలు, ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ, వరి పంటతో పాటు రైతు పండించిన అన్ని రకాల పంటలకు 500 బోనస్ వంటి హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తొగరు రమేష్, మునగాల సోసైటీ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, నాయకులు తొగరు సీతరాములు, ఉడుం కృష్ణ, ఇంద్రశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి, నర్సింహరావు పాల్గొన్నారు.

# గంజాయి మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరం

**ప్రజాపక్షం/భువనగిరి :** యువత భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని భువనగిరి పట్టణ సిఐ రమేష్ సూచించారు. మంగళవారం భువనగిరి పట్టణంలోని టైమ్స్ జూనియర్ కళాశాలలో భువనగిరి పట్టణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రమేష్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు ఆరోగ్యంతో పాటు భవిష్యత్తును కూడా దెబ్బతీస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ లక్ష్మీ నర్సయ్య, పోలీసు సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా కొండయ్య

**ప్రజాపక్షం/నకిరేకల్ :** కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ మండల అధ్యక్షుడిగా మండలంలోని తాటికల్ గ్రామానికి చెందిన గాథగోని కొండయ్య నియమితులయ్యారు.ప్రభుత్వ విప్పు స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశంకు ప్రధాన అనుచరుడిగా ఉన్న కొండయ్యను టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మండల అధ్యక్షుడుగా నియమిస్తూ నియామక పత్రాన్ని జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే వేముల వీరేశం, డిసిసి అధ్యక్షుడు పున్న కైలాష్, సహకరించిన నాయకులు,కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

# సీజనల్ వ్యాధుల నివారణపై దృష్టి

**ప్రజాపక్షం/వేములపల్లి :** సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని సర్పంచ్ సందీప్ కుమార్ అన్నారు.మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో వ్యాధుల నివారణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. రానున్నది వర్షాకాలం దృష్ట్యా దోమల ద్వారా వచ్చే డెంగ్యూ,మలేరియా,కలరా,టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి సుచరిత సూచించారు. వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి శుక్రవారం డ్రై డేఫ్రైడే కార్యక్రమం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎంపీఎం,ఆర్ఐ స్పందన, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# చెస్ చాంపియన్ మేకల అభినవ్ జయంతి వేడుకలు




**ప్రజాపక్షం/కోదాడ:** సూర్యచంద్రులు ఉన్నంత వరకు క్రీడారంగంలో అసియన్ చెస్ చాంపియన్ మేకల అభినవ్ పేరు చిరస్మరణీయంగా నిలిచిపోతుందని కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నంబాబు, పిసిసి డెలిగేట్ చింత కుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి లు అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న చెస్ చిచ్చరపిడుగు మేకల అభినవ్ 36వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అభినవ్ విగ్రహనికి తల్లిదండ్రులు మేకల వెంకటేశ్వర్లు, అరుణలతో కలిసి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదివి డివిజన్ స్థాయిలో ప్రతిభ కనబర్చిన ఒక పేద విద్యార్థికి అభినవ్ జ్ఞాపకార్థం నగదు ప్రోత్సహక బహుమతిని అందజేశారు. దొంగరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ దేవరం మల్లేశ్వరి, మాజీ సర్పంచ్ పార సీతయ్య, ఎంఈవో సలీంషరిఫ్, షేక్ బషీర్, కందుల కోటేశ్వరరావు, గంధం పాండు, తోట శ్రీను, తూనం కృష్ణ, షేక్ నయీం, రావెళ్ల సీత రామయ్య, బొలిశెట్టి కృష్ణయ్య, రామినేని శ్రీనివాస రావు, సుందరి వెంకటేశ్వర్లు, బద్దం భద్రారెడ్డి, బొల్లు రాంబాబు పాల్గొన్నారు.

# రోడ్డుపై భారీ గుంతలు... ట్రాఫిక్‌కు అంతరాయం



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండలంలోని గడ్డిపల్లి గ్రామ పరిధిలోని సూర్యాపేట గరిడేపల్లి ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడి వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం ఓ టిప్పర్ వాహనం భారీ గుంతలో ఇరుక్కుపోవడంతో సుమారు గంటన్నర పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో రహదారిపై వాహనాలు బారులు తీరగా, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రహదారిపై ఏర్పడిన గుంతలకు శాశ్వత పరిష్కారం చూపకుండా కేవలం కంకర, మట్టి పోసి తాత్కలిక మరమ్మతులతో అర్అండ్‌బి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని వాహనదారులు అరోపిస్తున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గుంతలు మరింత ప్రమాదకరంగా మారాయని, తరచూ చిన్నచిన్న ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

# విద్యుదాఘాతంతో ఆరు పాడి గేదెల మృతి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గాలివాన బీభత్సానికి విద్యుత్ వైర్లు తెగిపడి మేతకు వెళ్లిన ఆరు పాడి గేదెలు అక్కడికక్కడే మృతి చెందిన విషాద ఘటన మిర్యాలగూడ మండలంలోని బండమీదిగూడెంలో చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తక్కెలపాడు గ్రామ శివారు బండమీదిగూడెంలో మంగళవారం గ్రామంలో ఒక్కసారిగా వీచిన గాలి, దుమారం కారణంగా విద్యుత్ లైన్లలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి వైర్లు తెగి కిందపడ్డాయి. అదే సమయంలో మేత కోసం వెళ్లిన పాడి గేదెలకు ఈ లైన్లు తగలడంతో విద్యుత్ ఘాతానికి గురై ఆరు గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. ప్రమాదానికి గురైన పశువులలో బండమీదిగూడెం గ్రామానికి చెందిన నారబోయిన అంజయ్య, నారబోయిన వెంకటయ్యలకు చెందిన గేదెలతో పాటు, తక్కెలపాడు తండాకు చెందిన భారతి మరియు మరో ఇద్దరు రైతులకు చెందిన పాడి గేదెలు ఉన్నట్లు గుర్తించారు. జీవనాధారమైన పాడి గేదెలు ఒక్కసారిగా కళ్లముందే మృతి చెందడంతో పశువుల యజమానులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ



ఘటన వల్ల తమకు భారీగా ఆర్థిక నష్టం వాటిల్లిందని, కోలుకోలేని దెబ్బ తగిలిందని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన నష్టపరిహారం అందించి తమను ఆర్థికంగా ఆదుకోవాలని వేడుకున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న సంబంధిత విభాగాధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు.

# పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జాతీయ స్థాయిలో జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడలో ఈ నెల 28న జరిగే పల్స్ పోలియో చుక్కల వేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మునిసిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, కమీషనర్ నర్రా శ్రీజారెడ్డిలు కోరారు. స్థానిక మునిసిపల్ మీటింగ్ హాలులో పల్స్ పోలియో సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ పోలియో వ్యాధి నిర్మూలన జరిగిందని అయిన ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా 0 నుండి 5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమం గురించి ట్రైనింగ్ సీజనల్ వ్యాధులను అరికట్టడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి నిర్వహించిన సమావేశంలో బంగారుగడ్డ, ప్రకాష్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యధికారులు డాక్టర్ జానకి రాములు, డాక్టర్ నిపుణ్ వివరించారు. సమావేశంలో సానిటరీ ఇన్స్పెక్టర్ రవితేజ, పర్యావరణ ఇంజనీర్ శ్వేత, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్స్, ఎఎన్ఎలు, అంగన్వాడీ టీచర్స్ లు పాల్గొన్నారు.



# మహిళను కత్తితో పొడిచి గాయపర్చిన వ్యక్తి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మహిళను కత్తితో పోడిచి గాయపర్చిన ఘటన మంగళవారం నేరేడుచర్ల పట్టణంలో జరిగినట్లు ఎస్ఐ సైదిరెడ్డి తెలిపారు. ఎస్ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన తాళ్ల కాశమ్మ అనే మహిళను ఇదే పట్టణానికి చెందిన షేక్ సుబాన్‌తో గత కొంతకాలంగా పరిచయం ఏర్పడింది. వారిద్దరూ కలిసి మిర్యాలగూడెంలో ఓ ఇంట్లో కిరాయికి ఉంటున్నారు. కాశమ్మ అనారోగ్య కారణంగా గత రెండు నెలల నుండి నేరేడుచర్లలో తమ దత్తత తీసుకున్న కొడుకుతో కలిసి ఉంటుంది. ఈ నేపథ్యంలో కాశమ్మ తన వద్దకు రావడంలేదనే కోపంతో షేక్ సుబాన్ మంగళవారం ఇంట్లో పడుకుని ఉన్న కాశమ్మను కూరగాయాలు కోసే కత్తితో కడుపులో మూడుసార్లు పొడిచాడు. రక్తస్రావం అయిన కాశమ్మను చికిత్స నిమిత్తం మిర్యాలగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కాశమ్మ అరోగ్య పరిస్థితి మెరుగుపర్చడంతో డాక్టర్లు డిశ్చార్జి చేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# రైతుల తప్పక పాటించాలి

**ప్రజాపక్షం/నడిగూడెం:** అధికారుల సూచనలను రైతులు తప్పక పాటించాలని మండల వ్యవసాయ అధికారి మల్సూర్, సర్పంచ్ దున్న శ్రీనివాస్ లు కోరారు. మంగళవారం మడంల కేంద్రంలోని నడిగూడెం, సిరిపురం రైతు వేదికలలో ఏర్పాటు చేసిన విత్తన మేళలో వారు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా భూసార పరీక్షలు నిర్వహిస్తూ దానికి అనుకూలంగా పంటమార్పిడి చేయాలని కోరారు. విత్తనాలపై ప్రత్యేక చొరవ చూపుతూ ప్రసారం చేస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సన్న రకాల విత్తనాలను సాగు చేసి బోనస్‌ను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వో అనిత, ఎఈవో వెంకటరెడ్డి, ఎక్లాస్‌ఖాన్‌పేట సర్పంచ్ నర్సింహారావు, రైతులు పందిరి వెంకటరెడ్డి, యలక సంజీవరెడ్డి, బోళ్ల సీతరామిరెడ్డి, గుండు పాపయ్య, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

# విద్యను వ్యాపారంగా చూడొద్దు



**ప్రజాపక్షం/మునగాల:** జిల్లా వ్యాప్తంగా కార్పోరేట్ ప్రైవేట్ విద్యా సంస్థల్లో పీజుల దోపిడిని అరికట్టాలని, విద్యా సంస్థలలో పుస్తకాల అమ్మకాలను నిషేదించాలని, విద్యా హక్కు చట్టం ప్రకారం 25శాతం పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలని బిసి విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బరాఖత్ గూడెం గ్రామంలో బిసి సంఘ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ కార్పోరేట్ స్కూల్‌లో ఫీజుల దోపిడి వల్ల ఎంతోమంది పేదలు ఆర్థికంగా నష్టపోతున్నారని, పుస్తకాలు, యూనిఫాం, షూష్ అమ్మడం నిషేదం ఉన్న అధికారుల నిర్లక్ష్యం వల్ల డబ్బులు అధికంగా వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిసిసేన జాతీయ కార్యదర్శి డాక్టర్ నరాల రుక్మారావు, మండవ నర్సింహారావు, రెడ్డిపల్లి లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

# అంజయ్యకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ ప్రజా కళ 99 రోజుల సాంస్కృతిక మహోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి రవీంద్రభారతి లోని పాల్కురికి సోమన్న మూల వేదికపై నిర్వహించిన కవి సమ్మేళనంలో నల్లగొండ జిల్లాకు చెందిన ప్రముఖ కవి,రచయిత,జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి పున్నమి అంజయ్యకు ఘన సన్మానం జరిగింది.ఈ కవి సమ్మేళనంలో పున్నమి అంజయ్య గానం చేసిన కవిత సభికులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి,ప్రముఖ కవి యాకూబ్, సభా నిర్వాహకులు మడత భాస్కర్ పాల్గొన్నారు.





## విత్తన మేళా

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట పట్టణంలోని రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు నాణ్యమైన విత్తనాల వినియోగం, పంటల సాగులో ఆధునిక విధానాలు, ప్రభుత్వ వ్యవసాయ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, జిల్లా నాయకులు గంగుల రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షులు జమీరొద్దిన్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలపై అవగాహన

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం (జూన్ 26) సందర్భంగా మంగళవారం అడ్డగూడూరు మండల కేంద్రంలోని మంగమ్మ గూడెం పరిధిలో తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం పోలీసులు బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సిబ్బంది పోలీసు వారు పాల్గొన్నారు.

## థర్డ్ అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి మోక్షం ఎప్పుడు?

**ప్రజాపక్షం/నాంపల్లి :** మండలంలోని పసునూరు గ్రామంలో థర్డ్ అంగన్‌వాడీ కేంద్రం గత కొన్ని సంవత్సరాలుగా అద్దె భవనాల్లోనే కొనసాగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .గ్రామంలో సొంత భవనం లేకపోవడంతో అంగన్‌వాడీకి వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్రాన్ని లీజుకు తీసుకొని నడుపుతుండగా, భవన యజమానులు తరచూ ఖాళీ చేయమనడంతో ఇప్పటి వరకు 10 నుంచి 12 అద్దె భవనాలు మార్చాల్సి వచ్చిందని వాపోయారు. ప్రభుత్వ భవనం లేకపోవడం వల్ల అంగన్‌వాడీ సిబ్బంది, లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వ అధికారులు స్పందించి పసునూరులో థర్డ్ అంగన్‌వాడీ కేంద్రానికి శాశ్వత భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కాంగ్రెస్ నూతన అధ్యక్షుడిగా అక్కెనపల్లి వాసికి చోటు

ప్రజాపక్షం నార్కట్‌పల్లి :నార్కట్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి అక్కెనపల్లి గ్రామానికి చెందిన గాయం శ్యామ్‌సుందర్ రెడ్డిని వరించింది.టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ 16 జూన్ 2026న జారీ చేసిన ఉత్తర్వుల్లో శ్యామ్ సుందర్ రెడ్డి పేరు ఖరారైంది.డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాస్ నేత సిఫారసు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో ఈ నియామకం జరిగింది. అక్కెనపల్లి గ్రామం నుంచి సాధారణ కార్యకర్త నుంచి మండల అధ్యక్షుడిగా ఎదిగిన శ్యామ్‌సుందర్ రెడ్డి,ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా సమిష్టిగా క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తా అని తెలిపారు.



# చాత్రోంకి గూంజ్-విద్యార్థి యువత గొంతుక అనే మహా ఉద్యమానికి మద్దతు తెలపాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** దేశంలోని కోట్లాది యువత, విద్యార్థి కుటుంబాలకు భరోసా నింపుతున్న రాహుల్ గాంధీ ఆలోచనలకు పార్టీలకు అతీతంగాని మద్దతు తెలపాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పున్న కైలాస్ నేత పిలుపునిచ్చారు.మంగళవారం పట్టణంలోని యాదవ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల రాజస్థాన్‌లోని కోటాలో చాత్రోంకి గూంజ్‌విద్యార్థి యువత గొంతుక అనే మహా ఉద్యమాన్ని ప్రారంభించారని తెలిపారు.నీట్ పరీక్షల రద్దుకు బాధ్యత వహించి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇది పూర్తిగా మోడీ ప్రభుత్వ వైఫల్యమని, దీనిపై పార్లమెంట్‌లో ఎన్డీఏ ప్రభుత్వం ప్రకటన చేయాలని, దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోడీ క్షమాపణ చెప్పాలని కోరారు.2025లో కూడా నీట్ పేపర్ లీక్ అయిందని ఆరోపణలు ఉన్నాయని,2024లో నీట్‌యూజీ పేపర్ లీకేజీ వ్యవహారం యావత్ దేశాన్ని నివ్వెరపరిచిందని అన్నారు. మధ్యప్రదేశ్‌లో వ్యాపం స్కామ్‌తో 2015 నుంచి 2022 వరకు వైద్య, పోలీస్, ఉపాధ్యాయ పరీక్షలతో సహా 13 పరీక్షల్లో అక్రమాలు జరిగాయని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు బోడ స్వామి,ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు జిల్లాపల్లి పరమేశ్,ఏళ్ల రవీందర్ రెడ్డి, పగిళ్ల రాజు,చర్లపెల్లి గౌతమ్,వేముల గోపీనాథ్, బట్టు జంగయ్య,ఎండి అజీజ్, చింత ధనుంజయ్,జమ్మూ అశోక్,ఆకటి సైదులు,ఎండి అమన్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోళ్లలో నార్కట్‌పల్లి టాప్



**ప్రజాపక్షం/నకిరేకల్ :** నియోజకవర్గ స్థాయిలో వడ్ల కొనుగోలుపై సోమవారం జరిగిన సమీక్షలో నార్కట్‌పల్లి మండలం రికార్డు సృష్టించింది. ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం చేతుల మీదుగా 11ఐకేపీ కేంద్రాల నిర్వాహకులు,సీసీలు,ఏపీఎం, తహసీల్దార్ లను సన్మానించారు.మండలంలో 2742 మంది రైతుల నుంచి 688 లారీల ద్వారా 2,21,886 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు.ఇది జిల్లాలో ఐకేపీ కేంద్రాల వారీగా రెండో స్థానం కాగా,నకిరేకల్ నియోజకవర్గంలో మొదటి స్థానం.రైతులకు ఇబ్బంది లేకుండా గోదాములు ఏర్పాటు చేసి కొనుగోళ్లు పూర్తి చేసినందుకు ఎమ్మెల్యే వీరేశంకు, ప్రభుత్వానికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలోహసీల్దార్ ఎల్.వెంకటేశ్వరరావు,ఏపీఎం జీడికల్లు,సీసీలు రమాదేవి, అహ్మదున్నిసా బేగం,శ్రీనివాసులు, నర్సింహా 11 ఐకేపీ కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఎపి తరహాలో తెలంగాణలోనూ పాత పెన్షన్ అమలు చేయాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఆంధ్రప్రదేశ్‌లో 1 సెప్టెంబర్ 2004 కంటే ముందు నోటిఫికేషన్ విడుదలై,ఆ తర్వాత నియామకాలు పొందిన ప్రభుత్వ ఉద్యోగులు,ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేస్తూ ఏపీ క్యాబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం పట్ల తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్‌టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మనగోటి జనార్ధన్,ప్రధాన కార్యదర్శి తరాల పరమేశ్ యాదవ్ లు హర్షం వ్యక్తం చేశారు.లబ్ధి పొందిన ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ,ఉపాధ్యాయులకు ఈసందర్భంగా సంఘం తరఫున ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ఉమ్మడి రాష్ట్రంలో ఒకే నోటిఫికేషన్ ద్వారా,ఒకే నియామక ప్రక్రియ కింద ఎంపికైనప్పటికీ,భౌగోళిక విభజన కారణంగా ఇరు రాష్ట్రాల్లో విధుల్లో చేరిన ఉద్యోగుల పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించిందని,కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా న్యాయబద్ధమైన తీర్మానాన్ని ఆమోదించిందని కొనియాడారు.ఇదే నియామక ప్రక్రియ ద్వారా ఉమ్మడి నోటిఫికేషన్ ఆధారంగా తెలంగాణ ప్రాంతంలో విధుల్లో చేరిన వేలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు నేటికీ పాత పెన్షన్ హక్కును కోల్పోయి నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఉమ్మడి నోటిఫికేషన్ల ద్వారా నియమితులైన తెలంగాణలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ కూడా తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేస్తూ ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని,తద్వారా వారి పదవీ విరమణ జీవితాలకు భద్రత కల్పించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్టీఎఫ్) పక్షాన తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# 24X7 సేవలు అందుబాటులో.. బాక్స్‌లు పెంచుతాం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్ట్ ఐ డొనేషన్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేత్ర అండ్ పార్థివ దేహ దాన సేవా కేంద్రం ద్వారా ప్రజల సేవార్థం 24X7 ఫ్రీజర్ బాక్స్ సేవలను ప్రారంభించినట్లు ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హరనాథ్,మేనేజర్ డాక్టర్ పుల్లారావు,ట్రస్ట్ కోశాధికారి లయన్ గుండెబోయిన లింగయ్య తెలిపారు.మంగళవారం నల్లగొండ లయన్స్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని ఈ సేవలను ప్రారంభించారు. ప్రస్తుతం అత్యాధునిక సాంకేతికతతో కూడిన 5ఫ్రీజర్ బాక్స్‌లు అందుబాటులో ఉన్నాయని,భవిష్యత్తులో ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని ఫ్రీజర్ బాక్స్‌లను అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు.లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని నేత్ర అండ్ పార్థివ దేహ దాన సేవా కేంద్రం గత రెండు సంవత్సరాలుగా విశేష సేవలు అందిస్తూ ఇప్పటివరకు 410 జతల కార్నియాలను సేకరించి 820 మంది కార్నియల్ అంధులకు చూపు ప్రసాదించే అవకాశం కల్పించిందని వివరించారు.ఈ కార్యక్రమంలో లయన్ చంద్రశేఖర్ చిరునోముల,కక్కిరేణి శ్రీనివాస్,మిర్యాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## నాణ్యమైన విత్తనాలు,నానో ఎరువులు పంపిణీ

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** దళారులను నమ్మి నాణ్యతలేని విత్తనాలు కొనవద్దని,ప్రభుత్వం సర్టిఫై చేసిన వాటినే సాగు చేయాలని ఎమ్మెల్యే వీరేశం రైతులకు సూచించారు.మండల రైతు వేదికలో సోమవారం నిర్వహించిన విత్తన మేళాను ఎమ్మెల్యే వేముల వీరేశం, డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాస్ నేత కలిసి ప్రారంభించారు.ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, నానో ఎరువులను రైతులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం సిఫారసు చేసిన ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలు,నానో యూరియా, నానో డీఏపీ, కంది, పెసర పప్పుధాన్యాల విత్తనాలను రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వరరావు,మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల ఉషయ్య గౌడ్,నూతన అధ్యక్షుడు గాయం శ్యామ్‌సుందర్ రెడ్డి,సర్పంచ్ జెరిపోతుల భరత్ గౌడ్,నాయకులు సటు సత్తయ్య,జిల్లా మహేశ్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని జంకుతండా ఎక్స్‌రోడ్డు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ మండలం వేంకటాద్రిపాలెం గ్రామంలో కోదాడ జడ్చర్ల హైవే వద్ద టీ తాగిన అనంతరం తన గ్రామమైన జంకుతండాకు వెళ్లేందుకు జంకుతండా ఎక్స్ రోడ్ వద్ద మంగళవారం రోడ్డు దాటుతున్న సమయంలో, హాలియా నుండి మిర్యాలగూడ వైపు వెళ్తున్న నిందితుడు పిల్లి మారుతి తన మోటార్ సైకిల్‌ను అతివేగంగా నిర్లక్ష్యంగా నడుపుతూ రామావత్ సక్రు(65)ను ఢీకొట్టాడు. దీంతో తల, శరీరం వెనుక భాగంలో తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే సక్రుని మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం విధుల్లో ఉన్న వైద్యుడు అతను మరణించినట్లు నిర్ధారించారు.ఈ విషయాన్ని మృతుడి కుమారుడికి తెలియజేయగా, అతను హైదరాబాద్‌లో ఉన్నాడు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం. లక్ష్మయ్య తెలిపారు.

## యూరియా యాప్ రద్దు చేయాలి

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** వానాకాలం సీజన్‌లో రైతులకు సరిపడా యూరియా,ఎరువులు,నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని బిఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు పుల్లెంల వెంకట్ డిమాండ్ చేశారు.మంగళవారం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో నార్కట్‌పల్లి క్లస్టర్ ఏఈఓ విష్ణువర్ధన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరిపడా యూరియా అందించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం యాప్ పేరుతో కాలయాపన చేస్తోంది.బుకింగ్ విధానం తెలియక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నడింపల్లి మహేశ్,మాజీ కోఆప్షన్ సభ్యుడు వాజిత్ ఆసిఫ్,నాయకులు తొగరవెల్లి నాగరాజు,దుబ్బాక అరుణ్, బాసిత్,రాచకొండ సాయి,అక్కెనపల్లి రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 24న జిల్లాకు ప్రజాపాల-ప్రగతి ప్రణాళిక ప్రత్యేక అధికారి రాక

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రజాపాలప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి,రాష్ట్ర ప్రణాళిక,ఆర్థిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ ఈనెల 24న నల్లగొండ జిల్లాకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు.24న ఉదయం 10 గంటలకు ప్రత్యేక అధికారి నల్లగొండ జిల్లాకు చేరుకుంటారని, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు, తిరిగి మధ్యాహ్నం 2:30 నుంచి 4:30 గంటల వరకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజాపాలప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం సాయంత్రం 5:30 గంటలకు మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు.ఈ సమీక్ష సమావేశానికి సంబంధిత జిల్లా అధికారులందరూ హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.